క్లుప్తంగా

నేటి నుంచి జుడో వేసవి శిక్షణ

సామర్లకోట: విద్యార్థులలో శారీరక దారుఢ్యాన్ని, పోటీ తత్వాన్ని పెంచడానికి జుడోలో వేసవి శిక్షణ ఇస్తున్నట్టు చంద్రంపాలెం దేవులపల్లి కృష్ణశాస్త్రి మండల పరిషత్ పాఠశాల పీడీ కె.వీరబాబు తెలిపారు. ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య సోమవారం ఈ శిక్షణ ప్రారంభిస్తారన్నారు.

మూడు రోజుల పాటు రైల్వే గేటు మూసివేత



గేటు మూసివేయనున్నట్లు అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పిఠాపురం: పిఠాపురంలోని ఉప్పాడ రైల్వే గేటును మూడు రోజుల పాటు మూసివేయనున్నట్లు పిఠాపురం రైల్వే అధికారులు తెలిపారు. విద్యుత్, ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ గేటు మూసివేయనున్నామన్నారు. ఈ దారిలో వెళ్లే వాహనాలను మాధవపురం రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా మళ్లిస్తామని చెప్పారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ధాన్యం రాశుల పరిశీలన

సామర్లకోట: మండల పరిధిలో పొలంగట్లు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రాశులను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తున్న విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నూకాలమ్మతల్లి దర్శనానికి భక్తుల బారులు


అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ బందోబస్తు కల్పించారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాదగయను దర్శించిన ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్


పాదగయ క్షేత్రాన్ని దర్శించుకున్న ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతి

పిఠాపురం: పిఠాపురంలో ప్రముఖ శైవక్షేత్రమైన పాదగయను ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతి ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమె కుక్కుటేశ్వరస్వామిని, రాజరాజేశ్వరిదేవిని, దత్తాత్రేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ వి.శ్రీనివాస్ ఆమెకు స్వామివారి ప్రసాదం అందజేశారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందించిన ఆవాల దంపతులు

సామర్లకోట: స్థానిక 15వ వార్డుకు చెందిన ఇద్దరు విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంతో రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి ఆదివారం అభినందించారు. కె.గ్రీష్మవర్షిత 585, కె.సంపత్‌రామ్ 578 మార్కులు సాధించారు. దాంతో ఆవాల రాజేశ్వరీ నివాసం ఉంటున్న వార్డులోని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంతో విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్, రాష్ట్ర వైఎస్సార్ సీపీ కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

కొత్తపల్లి: ఉప్పాడ శివారు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే వర్మ అన్నారు. మండలంలోని ఉప్పాడలో ఆదివారం ఆయన పర్యటించారు. వేసవిలో తాగునీరు లేకుంటే ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటారో అధికారులు ఆలోచించాలన్నారు.

అమృతఫలం.. ఎంతో ప్రియం!

- దిగుబడి తగ్గి ధర పెరుగుదల
- అంతంత మాత్రంగా విక్రయాలు
- వర్షాలతో పండ్లకు పురుగుల బెడద


సామర్లకోట మరం సెంటర్‌లో వెలవెలబోతున్న మామిడి పండ్ల దుకాణం

సామర్లకోట: వేసవి వస్తోందంటే అందరి మనసూ మామిడి పండ్లవైపే లాగేస్తుంది. అమృతఫలమనే పేరు ఎలా వచ్చిందో తెలియదు కానీ నిజంగా ఒక్క చుక్క మామిడి రసం నాలుకపై పడినా ప్రాణం లేచొస్తుందంటే అతిశయోక్తి కాదు. మామిడి పండ్లను బహుమానంగా పంపి పాకిస్తాన్‌తో మైత్రీబంధాన్ని కోరుకుంటున్నట్టు సాక్షాత్తు దేశ ప్రధాని ఆ దేశ ప్రధానికి పరోక్ష సందేశం పంపిస్తున్నామంటే ఈ పండు ఎంత ప్రఖ్యాతమైనదో అర్థమవుతుంది. అటువంటి పండు ఈ ఏడాది అంత సులభంగా అందే పరిస్థితి కనిపించడం లేదు. దిగుబడి 50 శాతానికి పడిపోయింది. దీంతో సహజంగానే ధర అమాంతం పెరిగిపోతుంది.

కార్బైడ్ వంటి రసాయనాలతో కృత్రిమంగా పండిస్తే ఎక్కడ దొరికిపోతామో, శిక్ష పడుతుందోనని రైతులు ఆందోళన చెంది ఆ ప్రయత్నం విరమించుకుని సంప్రదాయబద్ధంగా గడ్డిలో మగ్గిస్తున్నారు. మార్కెట్‌లో మామిడి విక్రయాలు తగ్గడానికి ఇదికూడా కారణంగా కనిపిస్తోంది. గత ఏడాది డజను పండ్లు రూ.100 నుంచి రూ.150 ఉంటే ప్రస్తుతం రూ.200 నుంచి రూ.300 వరకు విక్రయిస్తుండడం గమనార్హం.

పచ్చికాయలు ఎగుమతి...

చెట్ల నుంచి పచ్చి కాయలు కోసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. మామిడి కాయలను పెద్ద పెద్ద కంపెనీలు పచ్చళ్ల తయారీకి, శీతల పానీయాల తయారీకి కొనుగోలు చేయడం వల్ల కొరత ఏర్పడింది.

20 ఏళ్లుగా విక్రయిస్తున్నాను



20 ఏళ్లుగా రైతుల నుంచి మామిడి కాయలు కొని ముగ్గించి 20 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి సామర్లకోటలో విక్రయిస్తున్నా. ఈ ఏడాది విక్రయాలు అంతగా లేవు. రోజంతా విక్రయిస్తే రూ.500 వస్తుంది. కాలానికి తగ్గట్టు పండే పండ్లను విక్రయిస్తుంటాను.

– వీరబాబు, పండ్ల వ్యాపారి, కోటపాడు

గడ్డిలో పండించే వారు తక్కువ



గతంలో మామిడి కాయలను సంప్రదాయబద్ధంగా ముగ్గించేవారు. అవి ఎంతో మంచి సువాసనతో, రుచిగా ఉండేవి. నేడు మామిడి పండ్లలో వాసన కనిపించడం లేదు. గడ్డిలో ముగ్గవేసే వారు కరువయ్యారు.

– తోటకూర గంగాధర్, శ్రీరామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు, పీబీ దేవం

చిన్ననాటి నుంచి ఆధ్యాత్మిక తత్వం అలవరచుకోవాలి


పిల్లలకు సర్టిఫికెట్లు అందజేసిన ఉమర్ ఆలీషా

పిఠాపురం: విద్యార్థులు చిన్ననాటి నుంచి ఆధ్యాత్మిక తత్వ జ్ఞానాన్ని నేర్చుకుంటే జీవితం ఆనందమయంగా సాగుతుందని శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. స్థానిక పీఠం నూతన ఆశ్రమం ఆవరణలో శనివారం తాత్విక బాల వికాష్ వేసవి శిక్షణా శిబిరం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నారులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని భౌతిక జీవితాన్ని చక్కగా నిర్వర్తించాలని సూచించారు. పీఠం తాత్విక బాల వికాష్ వేసిన పునాదిని మరచిపోకుండా అందరినీ జ్ఞాన మార్గంలో నడిచేలా ప్రోత్సహించాలన్నారు. శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రణవాశ్రమానికి చెందిన ప్రభావతి మాతాజీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పిఠాపురం: 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు కుంచే చిన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పిఠాపురంలో ఆదివారం నిర్వహించిన కాకినాడ జిల్లా 104 ఉద్యోగుల సంఘ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ రాష్ట్ర 104 ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీకాంత్ తదితరులు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా 104 ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి


శిబిరంలో మాట్లాడుతున్న బలరామకృష్ణ

సామర్లకోట: ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఆదివారం కాకినాడ బాలవేదిక కన్వీనర్, రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు నోరి బలరామకృష్ణ విద్యార్థులను చెణుకులు, చమత్కార సంభాషణలతో ఆనంద డోలికల్లో తేలించారు. మాధవపట్నం శివారు జమునానగర్ కాలనీలో బాలమందిరం, జిల్లా విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిబిరంలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆయన పాల్గొని అనేక విషయాలను వివరించారు. విద్యార్థి నెంబరు వన్ కావడం ఎలా అనే అంశంపై ఆసక్తికరమైన విలువైన సూచనలిచ్చారు. భాషా నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, న్యూస్ రీడింగ్, యాంకరింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి బాలమందిరం కన్వీనర్ అంగర గోపాలకృష్ణ వేసవి వినోద కార్యక్రమాలు నిర్వహించారు.

అల్లూరి స్ఫూర్తితో విద్యలు నేర్వాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ మంగతాయారు
- మన్నెం వీరుడికి నివాళులు


సమ్మర్ క్యాంప్ మెటీరియల్ అందజేస్తున్న చైర్‌పర్సన్

పెద్దాపురం: ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు తమ విద్యను కొనసాగించాలని పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అన్నారు. స్థానిక వరహాలయ్య పేట యాసలపు సూర్యారావు భవనంలో అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం వేసవి శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. రొంగల అరుణకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులు అందరూ అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని బాల్యం నుంచే ఏక కాలంలో పలు విద్యలు నేర్చుకోవాలని సూచించారు. ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, సోషల్ మీడియా ఫర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ముక్తార్ ఆలీ, మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీం అడ్మిన్ నరేష్ పెదిరెడ్డి, చరిత్ర పరిశోధకులు వంగలపూడి శివకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అన్ని విద్యలు నేర్చుకునేందుకు పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) వేసవి శిబిరం దోహదపడుతుందన్నారు. అనంతరం సమ్మర్ క్యాంప్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు.

అల్లూరి స్ఫూర్తితో పోరాడాలి

పెద్దాపురం: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అడుగుజాడల్లో పయనించేందుకు యువత సిద్ధం కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు పేర్కొన్నారు. అల్లూరి వర్ధంతిని మండల వ్యాప్తంగా నిర్వహించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వరహాలయ్యపేట, పాత బస్టాండ్‌లలో రొంగల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహాలకు వారు నివాళులర్పించారు. జోశ్యుల కృష్ణబాబు, డి.క్రాంతికుమార్, కూనిరెడ్డి అరుణ, సీపీఎం, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.


ఆనూరులో అల్లూరి వర్ధంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న రైతు కూలీలు


సామర్లకోటలో అల్లూరికి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఆనూరు గ్రామంలో సీతారామరాజు వర్ధంతిని నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజుబాబు మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో పోరాటాల దిశగా పయనిద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఎల్లె సత్తిబాబు, దేశెట్టి సురేష్, పైడిమళ్ల నాగరాజు, గానుగుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..

సామర్లకోట: స్థానిక బళ్ల మార్కెట్ సెంటర్‌లో డీవైఎఫ్ఐ నాయకులు అల్లూరికి నివాళులు అర్పించారు. ఫెడరేషన్ మాజీ జిల్లా అధ్యక్షుడు కరణం ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దారబాని సింహచలం, కరణం ఏడుకొండలు, కరణం గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం రైల్వేస్టేషన్‌లో తేనెపట్టు

- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు


అన్నవరం రైల్వేస్టేషన్‌లో పట్టిన తేనెపట్టు

అన్నవరం: వేలాది మంది ప్రయాణికులు, భక్తులు ప్రతినిత్యం ప్రయాణించే అన్నవరం రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫాం లిఫ్ట్ వద్ద తేనెపట్టు పట్టింది. అక్కడ తేనెటీగలను చూసి ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రెండు, మూడో నంబర్ ప్లాట్‌ఫాంలు కలిసే ఉంటాయి. మూడో నంబర్ ప్లాట్‌ఫాం మీద విశాఖపట్నం వైపు వెళ్లే రైళ్లు ఆగుతాయి. తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు సుమారు 20 రైళ్లకు ఇక్కడ హాల్ట్ ఉంది. ఆ రైళ్లలో దిగిన ప్రయాణికులు రెండో నంబర్ ప్లాట్‌ఫాం మీద గల లిఫ్ట్ ద్వారా ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదుగా వెలుపలకు వచ్చి అక్కడ నుంచి అన్నవరం దేవస్థానానికి వెళ్లే వాహనాల స్టాండ్‌కు వస్తారు. వీరిపై తేనెటీగలు దాడిచేసే అవకాశం ఉండడడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అన్నవరం రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌త్రినాథ్‌రెడ్డిని వివరణ కోరగా సమస్యను సామర్లకోట రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు.

తడిసిన పంటల పరిశీలన

గోకవరం: మండలంలోని కొత్తపల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు కళ్లాల్లో తడిసిన మొక్కజొన్న పంటను ఆదివారం మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

జగ్గంపేట: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని స్థానిక ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని, ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్‌కు హాజరువాలని హెచ్చరించారు. ప్రతిఒక్కరి కదలికలపై నిఘా ఉంచుతామన్నాని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మట్టిలో మాణిక్యం

- టాపు లేపిన రమణక్కపేట విద్యార్థిని
- గురుకుల పాఠశాలల్లో రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానం సాధించిన జ్యోత్స్న


తల్లి సింహాచలంతో కుమార్తెలు జ్యోత్స్న, సాద్విక

పిఠాపురం: కడు పేదరికం.. తల్లిదండ్రుల నిరక్షరాస్యత.. గ్రామీణ వాతావరణం.. ఇటువంటి ప్రతికూలతలన్నీ ఆ బాలిక విజయాన్ని ఆపలేకపోయాయి. ఆమె పట్టుదల ముందు తల వంచాయి. ప్రణాళికాబద్ధమైన సాధనతో తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చేలా.. ఎవ్వరూ ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. ఆడపిల్లలకు చదువెందుకన్న వారందరితో శభాష్ అనిపించుకుంది. ప్రైవేటు విద్యా సంస్థల మెట్లు ఎక్కకుండానే పోటీ ప్రపంచంలో నిలిచి గెలిచి, తన సత్తా నిరూపించుకుంది. యు.కొత్తపల్లి మండలం రమణక్కపేటకు చెందిన దడాల జ్యోత్స్న పదో తరగతి పరీక్షల్లో ఏకంగా 589 మార్కులతో.. గురుకుల పాఠశాలల్లోనే రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానం సాధించింది. ఆమె చదువుతున్న కాకినాడ రూరల్ పి.వెంకటాపురంలోని బాలయోగి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.సుశీల ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

ముగ్గురూ ముగ్గురే..

జ్యోత్స్న తల్లిదండ్రులు శాంతి, సింహాచలం. సింహాచలం ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేయడంతో పాటు వ్యవసాయ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆ దంపతులకు కుమారుడు ఆశిష్, కుమార్తెలు జ్యోత్స్న, సాద్విక. ఒక్క కుమారుడికే చదువు చెప్పించడమే భారం కాగా.. మిగిలిన ఇద్దరు ఆడపిల్లలకూ ఎలా చదువు చెప్పించాలో తెలియక తండ్రి సింహాచలం మధనపడేవాడు. దీనికి తోడు చదువుకున్నాక ఆడపిల్లలకు కట్నాలు ఎక్కువగా ఇవ్వాల్సి వస్తుందని స్థానికులు అనే మాటలు అతడిని మరింత ఆందోళనకు గురి చేసేవి. కానీ తన పిల్లలు పెద్ద చదువులు చదవాలన్న ఆకాంక్ష మాత్రం ఆయనలో బలంగా నాటుకుపోయింది. దీనిని ఎలాగైనా నెరవేర్చాలని ముగ్గురు బిడ్డలూ నిర్ణయించుకున్నారు. తండ్రిపై భారం పడకుండా పెద్ద చదువులు చదవాలన్న వారి ఆశలకు గురుకుల పాఠశాల వెలుగు దివిటీ అయ్యింది. గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల్లో ముగ్గురూ విశేష ప్రతిభ చూపి, సీట్లు సాధించారు. ఒకరిని మించి ఒకరు అన్నట్టుగా చదువులో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం ఆశిష్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. సాద్విక గురుకుల పాఠశాలలో 9 చదువుతోంది.

డాక్టర్‌నవుతా..

మాది నిరుపేద కుటుంబం. మా ఊళ్లో పెద్ద ఆసుపత్రులు లేవు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా దూర ప్రాంతానికి వెళ్లాలి. అందుకే బాగా చదివి నేను డాక్టర్‌ని కావాలన్నది నాన్న కోరిక. ఆ మాటలే నాకు స్ఫూర్తి. ముందుగా మా అన్నయ్య గురుకుల పాఠశాలలో ప్రవేశించి మాకు ప్రోత్సాహం ఇచ్చాడు. ప్రవేశ పరీక్షలో ఎలా నెగ్గుకు రావాలో నేర్పించాడు. అందుకే కష్టపడి చదువుకున్నా. ఇంత విజయం సాధిస్తానని ఊహించలేదు. కష్టానికి ప్రతిఫలం లభించిందని చాలా ఆనందంగా ఉంది. నా విజయం చూసి తల్లిదండ్రులు పడుతున్న ఆనందం నాకు మరింత ప్రోత్సాహంగా మారింది. బాగా చదివి, డాక్టర్‌ని అయ్యి, నా తల్లిదండ్రుల ఆశ నెరవేరుస్తాను. పేదలకు ఉచిత వైద్య సేవలందించాలన్నదే ధ్యేయం.

పది కాలాలు పచ్చగా..

- తూటేరు డ్రెయిన్‌లో పనులు ప్రారంభం
- వేట్లపాలెం వియర్ల మూసివేత
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


తూటేరు డ్రెయిన్‌లో తూటికాడ, గుర్రపు డెక్క తొలగిస్తున్న సిబ్బంది

సామర్లకోట: తూటేరు డ్రెయిన్‌లో పూడికతీతకు యంత్రాంగం సమాయత్తమైంది. మరో పదేళ్ల పాటు తమ పొలాలకు ముంపు సమస్య ఉండదని రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వీకే రాయపురం, బోయనపూడి గ్రామాలకు చెందిన పంట భూములు తరచూ ముంపునకు గురవుతున్న నేపథ్యంలో సాక్షి దినపత్రికలో కథనాలు ప్రచురితమవడం.. కలెక్టర్ స్పందించి అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో స్థానిక ఇరిగేషన్ సిబ్బంది వియర్లు మూసేసిన విషయం తెలిసిందే. తాజాగా రైతుల పొలాల్లో ఉన్న నీరు తూటేరు డ్రెయిన్‌లోనికి వెళ్లాల్సి ఉండగా డ్రెయిన్ గుర్రపు డెక్క, తూటికాడతో నిండి ఉండడాన్ని గమనించి కలెక్టర్‌కు వివరించారు. ఈ మేరకు ఆమె తూటేరు డ్రెయిన్ పూడిక తీత ప్రారంభించాలని ఆదేశించడంతో సిబ్బంది చురుగ్గా పనులు చేపట్టారు. డ్రెయిన్‌లో పెరిగిపోయిన తూటికాడ, గుర్రపు డెక్క తొలగిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే మరో పదేళ్ల వరకు తమ పొలాలకు ముంపు సమస్య ఉండదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే తూటేరు డ్రెయిన్‌లో నీరు పూర్తిగా తగ్గిన తరువాత మాత్రమే పూడిక తీత సాధ్యమవుతుందని అధికారులు చెప్తున్నారు. ఏదేమైనా వియర్ల మూసివేతతో పాటు తూటేరు డ్రెయిన్ పనులు వెంటనే ప్రారంభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వాతావరణంలో మార్పు వచ్చి రెండు రోజులుగా ఎండ కాయడంతో రైతులు ఊరట చెందుతున్నారు.

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ


రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాధ, బాబు

పెద్దాపురం: మండంలోని తాటిపర్తి గ్రామంలో ఆదివారం వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆయన తనయుడు వంగవీటి రాధాకృష్ణ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల బాబుతో కలిసి ఆవిష్కరించారు. కాపుసేన యువత, వంగవీటి రంగా యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో రాజకీయ చరిత్రలో కాపులకు ఉన్న ప్రాధాన్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

- ఎమ్మెల్యే కురసాల, కమిషనర్ రావిరాల
- ఖాళీ స్థలాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్


శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ రూరల్: కార్పొరేషన్‌లో నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఆదివారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. రూరల్ నియోజకవర్గం పరిధిలోని విద్యానగర్ ప్రాంతంలో నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ రావిరాలా మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొన్నారు. తొలుత స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యానగర్ పరిసర ప్రాంతాలలో ఎంపిక చేసిన ఖాళీ స్థలాల్లో చెత్త తొలగించారు. ఎమ్మెల్యే, కమిషనర్ తదితరులు స్వయంగా చెత్తను తొలగించగా ఒక జేసీబీ, మూడు ట్రాక్టర్లు, బ్లేడ్ ట్రాక్టర్లను వినియోగించారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ కాకినాడ పరిశుభ్రతకు మారుపేరుగా నిలుస్తుందన్నారు. బెస్ట్ లివింగ్ సిటీలలో ఒకటైన విద్యానగరంలో ఖాళీ స్థలాలు పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కొందరు స్థల యజమానులు వైఖరి వల్ల అనారోగ్య పరిస్థితులు నెలకొంటున్నాయని అన్నారు. కమిషనర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ 36 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించిన ఉన్న నగరంలో సుమారు 4 వేల ఖాళీ స్థలాలు గుర్తించామని, వాటిలో నీరు స్తంభించి చెత్త, చెదారాలతో పందులకు, దోమలకు ఆవాసాలుగా మారుతున్నందున సదరు యజమానులకు నోటీసులు ఇచ్చామని, వారు స్పందించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఆల్ ఈజ్ వెల్ వంటి సేవా సంస్థలు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. వారితో పాటు నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు, ఎలక్ట్రికల్ ఏఈ ఆదినారాయణ, కార్పొరేషన్ ఏఈ రమేష్, ఆల్ ఈజ్ వెల్ ప్రతినిధి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా పీజీ అప్‌డేట్

- అనస్తీషియా విభాగం ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో జోనల్ సీఎంఈ


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అతిథులు

కాకినాడ క్రైం: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో జోనల్ సీఎంఈ–3ని కాకినాడ ఆర్ఎంసీ అనస్తీషియా విభాగం ఆదివారం నిర్వహించింది. జీజీహెచ్‌లోని సర్జరీ ఎగ్జామినేషన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ సీఎంఈకి పీజీ అప్డేట్‌గా నామకరణం చేశారు. మత్తు వైద్య విద్యను అభ్యసిస్తున్న పీజీ విద్యార్థుల విజ్ఞాన ఉన్నతే లక్ష్యంగా అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన ఈ సీఎంఈని రూపకల్పన చేసి నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరుకాగా, విశిష్ట అతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి హాజరయ్యారు. 9 మంది వక్తలు కీలక అంశాలను చర్చించారు. డాక్టర్ ఏవీ రావు జోనల్ కో ఆర్డినేటర్‌గా, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు సీఎంఈ పర్యవేక్షకుడిగా వ్యవహరించిన కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేవీ మాధవి, డాక్టర్ ప్రసన్నకుమార్, వైద్య నిపుణులు పాల్గొన్నారు.